andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.8, కనిష్ఠం 9.7



తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

సిరికొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వేలో సేకరించిన వివరాలను ఆన్లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని మండల ప్రత్యేక అధికారి ఫణీందర్ సూచించారు. సిరికొండ మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి, ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఆపరేటర్లు ఆన్లైన్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కుటుంబాల వివరాలను ఆన్‌లైన్ చేశారని అడిగి తెలుసుకున్నారు.



ఆదిలాబాద్‌లో చలి మంటలు కాగుతున్న పట్టణ వాసులు



ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లో కమ్ముకున్న పొగమంచు



భీంపూర్‌లో పశువులకు గోనె సంచులతో వెచ్చదనం కల్పిస్తున్నరైతులు

వామ్మో.. చలి

- జిల్లాలో కనిష్ఠంగా 9.2 డిగ్రీల సెల్సియస్ నమోదు
- శీతల గాలుల ప్రభావంతో పెరుగుతున్న చలి తీవ్రత
- వణుకుతున్న మారుమూల గిరిజన గ్రామాలు
- అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యుల హెచ్చరికలు

ఆదిలాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో చలి తీవ్రత పెరుగుతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలలో పెద్దగా మార్పు లేకపోయినా కనిష్ఠ ఉష్ణోగ్రతల పతనం వేగంగా పడిపోతోంది. రాత్రిళ్లతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లోనూ చలిమంటలను వేసుకుంటూ ప్రజలు వెచ్చదనం పొందుతున్నారు. పొద్దు పోయిందంటే చాలు వామ్మో చలి అంటూ బయటకు వెళ్లేందుకే జంకుతున్నారు. అలాగే మార్నింగ్ వాక్ చేసేవారంతా సూర్యుడు ఉదయించిన తర్వాతనే ఆలస్యంగా బయటకు వెళ్తున్నారు. గడిచిన రెండు మూడు రోజులుగా చలి తీవ్రత మరింత ఎక్కువగా కనిపిస్తోంది. మంగళవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.8 డిగ్రీలు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 9.7 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఈ సీజన్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడం ఇదే మొదటి సారి. ప్రతీయేట జిల్లాలో డిసెంబరు మాసంలోనే అత్యల్పంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ నవంబరులోనే వరుసగా 10 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే డిసెంబరులో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తి పోతున్నారు. రాష్ట్రంలోనే అధిక వర్షపాతం, తీవ్రమైన ఎండలు, వణుకు పుట్టించే చలి తీవ్రత జిల్లాలో కనిపిస్తోంది. మూడు కాలాలు అధికంగానే ప్రభావాన్ని చూపుతాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింతగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నవంబరు 20 నుంచి జిల్లాలో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
నవంబరు 20	29.8	12.2
నవంబరు 21	30.3	12.7
నవంబరు 22	28.8	12.2
నవంబరు 23	28.3	12.2
నవంబరు 24	28.3	12.8
నవంబరు 25	29.3	10.8
నవంబరు 26	28.8	9.7

రాత్రి, పగలు చలే..

రాత్రి, పగలు అనే తేడా లేకుండానే చలి తీవ్రత కనిపిస్తోంది. డిసెంబరులో 3 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడం కనిపిస్తోంది. బేల మండలంలో అత్యల్పంగా 9.2 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా జైనథ్‌లో 9.3, భీంపూర్‌లో 9.5, మావలలో 10.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బోథ్, నేరడిగొండలో 10.2, ఆదిలాబాద్ అర్బన్‌లో 10.4, తలమడుగులో 10.7లకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. బేల, జైనథ్, భీంపూర్, మావల మండలాలకు ఆరేంజ్ అలర్ట్‌ను ప్రకటించగా మిగితా మండలాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు. ఉత్తర భారతదేశం నుంచి వీచే శీతల గాలుల ప్రభావం జిల్లాపై మరికొన్నాళ్ల పాటు ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతీ యేటా జిల్లాలో డిసెంబరు, జనవరి మాసాలను అతిశీతల మాసాలుగా పరిగణిస్తారు. అయితే గతంలో ఫిబ్రవరిలోనూ 6.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన దాఖలాలు ఉన్నాయి. అలాగే పశువులు కూడా చలికి అనారోగ్య బారిన పడకుండా రాత్రివేళల్లో పశువుల పాకలు, ఇళ్లలోనే పశువులను తరలిస్తున్నారు. కొందరైతే పశువులకు గోనె సంచులు కప్పి వెచ్చదనాన్ని కల్పిస్తున్నారు.

దట్టమైన పొగమంచు

ఉదయం వేళల్లో మారుమూల గిరిజన గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేస్తోంది. దీంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగి పోతుందంటూ మారుమూల గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వెచ్చని దుస్తులను ధరించే బయటకు వెళ్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు బోథ్ మండలం గుర్రాల తండా, తలమడుగు మండలం కోసాయి, ఉమ్రి, భీంపూర్ మండలం అర్లి(టి), బేల, జైనథ్, మండలాల్లోని మారుమూల గ్రామాల్లో అత్యల్పంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచే చల్లని ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. చలి నుంచి కాపాడుకునేందుకు గిరిజన గూడాల్లో ఇంటింటికీ చలి మంటలు వేసుకుంటున్నారు. రాత్రిళ్లు భోజనం కూడా చలి మంటల వద్దనే కానిస్తున్నారు. ప్రధానంగా ఏజెన్సీ మండలాల్లో దట్టమైన అడవులు, వాగులు, ఒర్రెలు, చెరువులు ఉండడంతో చలిగాలుల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. ఉదయం 9 గంటల వరకు మారుమూల గ్రామాల పరిసర ప్రాంతాలు దట్టమైన పొగమంచుతోనే కనిపిస్తున్నాయి. ఉదయం వేళల్లో ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో ఎటు చూసినా మరో కశ్మీర్‌ను తలపిస్తోంది.

మరికొన్నాళ్ల పాటు శీతలగాలుల ప్రభావం

- శ్రీధర్‌చౌహాన్, వాతావరణ శాఖ సీనియర్ శాస్త్రవేత్త

జిల్లాపై మరికొన్నాళ్ల పాటు శీతల గాలుల ప్రభావం ఉంటుంది. పత్తి పంటకు చలి తీవ్రత అంతగా అనుకూలం కాకపోయినా శనగ పంటకు మేలు జరుగుతోంది. కురుస్తున్న పొగమంచుతో పంట ఎదుగుదలకు తోడ్పడుతోంది. అయితే కొన్ని చీడపీడలు పంటను ఆశించే అవకాశం ఉంటుంది. రైతులు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవాలి. డిసెంబరులో చలి తీవ్రత మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



డేటా ఎంట్రీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్, పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీలను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్, మహాత్మా జ్యోతిబాపూలే హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా మెనూ చార్ట్‌ని పరిశీలించి ఈ రోజు మెనూ అడిగి తెలుసుకొని స్వయంగా పరిశీలించారు. భోజనం అందించే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలని, వంట పాత్రలు, వంట వండే ప్రాంతం ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు అందించే నాణ్యమైన పౌష్టికాహారం భోజనంపై ఆరా తీశారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖాధికారి టి.ప్రణీత

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యార్థులు ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదిలాబాద్ జిల్లా విద్యా శాఖాధికారి టి.ప్రణీత అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి విద్యా, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. పదోతరగతి విద్యార్థులు ఇప్పటి నుంచి ప్రణాళికాబద్ధంగా రానున్న వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అటు ఉపాధ్యాయులు కూడా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.రాములు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.వినోద్ రెడ్డి, ఎస్.వినోద్‌కుమార్, కె.శ్రీనివాస్ రెడ్డి కె.వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ మండలాల నాయకులు బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఇందులో బజార్‌హత్నూర్ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కానిందే దినేష్‌కుమార్, బోథ్ మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్, రాథోడ్ నందుకుమార్, ఆడే రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వీఆర్‌ఏ ఆత్మహత్యాయత్నం

- సర్వీస్ బుక్‌పై సంతకం చేయలేదని అఘాయిత్యం..
- పురుగుల మందు తాగిన ఉద్యోగి
- రిమ్స్ ఆస్పత్రికి తరలించిన అధికారులు



వీఆర్‌ఏ గంట అభిషేక్‌ను అంబులెన్స్ వరకు తీసుకువెళ్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సర్వీస్ బుక్‌పై సంతకం చేయలేదని ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఓ ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన కలకలం రేపింది. ఆర్డీఓ కార్యాలయంలోని డీఏవో తన సర్వీస్ పుస్తకంలో సంతకం పెట్టడం లేదని విసుగు చెందిన సదరు ఉద్యోగి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ ఉద్యోగిని కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది గమనించి అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. వివరాలు.. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన వీఆర్‌ఏ గంట అభిషేక్ ప్రస్తుత ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయ డీఏవో అర్రనరేందర్ ఒకప్పుడు ఖానాపూర్‌లో తహసీల్దార్‌గా పనిచేశాడు. అనంతరం నరేందర్ ఇటీవల ఆదిలాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. అయితే ఖానాపూర్‌లో వీఆర్‌ఏగా పనిచేసి అభిషేక్ ఇతర శాఖలో సర్దుబాటు అయ్యాడు. కాగా అభిషేక్ తన సర్వీస్ బుక్ తీసుకుని సంతకం కోసం ఆదిలాబాద్ కార్యాలయానికి రాగా ఏవో నరేందర్ సంతకం పెట్టకుండా ఇబ్బంది పెట్టడంతో అభిషేక్ పురుగుల మందు తాగాడు. గమనించిన కలెక్టరేట్ కార్యా లయ సిబ్బంది ఆయన్ని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయనకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ కరుణాకర్ రావ్, హుటాహుటిన రిమ్స్‌కు చేరుకుని బాధితుడితో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పులి సంచరిస్తున్నట్లు పుకార్లు

- కాదని తేల్చిన అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఇంద్రవెల్లి, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వడగామ్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు వచ్చిన పుకార్లు కలకలం రేపాయి. మంగళవారం సాయంత్రం వడగామ్ అటవీ ప్రాంతంలో మేకల కాపరులు మేకలు మేస్తుం డగా తమకు పులి కనిపించిందని పరుగులు తీయడంతో పాటు వ్యవసాయ చేన్‌లో పత్తి ఏరుతున్న మహిళలకు చెప్పడంతో మహిళలు పరుగులు తీసి ఇంటికొచ్చారు. కొంత మంది అయితే భయంతో చెట్లు ఎక్కినట్లు స్థానికులు చెప్పారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే వడగామ్ అటవీ ప్రాంతాన్ని సందర్శించి పులి కనిపిం చినట్లు చెప్పిన స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి పులి అనువాళ్ళు దొరకకపోవడంతో అది పులి కాదని, తోడేలుగాని నక్క లాంటి జంతువులను చూసి పులి అనుకున్నారని నిర్ధా రించారు. ఈ ప్రాంతానికి పులి రాలేదని, ఎఫ్ఎస్‌వో చంద్రారెడ్డి తెలిపారు.

డీఈవోకు సమ్మెనోటీస్ అందజేసిన ఉద్యోగులు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : ఆదిలాబాద్ డీఈఓ ప్రణీతను ఆమె కార్యాలయంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ డీఈఓకు సమ్మె నోటీస్ అందజేశారు. డిసెంబర్ 3వ తేదీ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని లేని పక్షంలో సమ్మెకు వెళ్తామని ఉద్యోగులు పేర్కొన్నారు. సంఘం సభ్యులు పడాల రవీందర్, పార్థ సారథి, దీప్తి పాల్గొన్నారు.



సమ్మె నోటీస్ అందజేస్తున్న ఉద్యోగులు

అర్హులందరికీ పథకాలు అందిస్తాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజక వర్గంలోని ప్రజలందరికి ప్రభుత్వ పథకాలు అందించడమే ప్ర భుత్వ ఉద్దేశమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని కన్నాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచా యతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల, రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డిఉన్నారు.

ఇంద్రవెల్లి : కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఖానాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పిప్రి గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా గ్రామ పంచాయతీ భవనం, లక్కుగూడ గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నూతన అంగన్‌వాడీ భవనం, దన్నోరా(బీ) గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నాలుగు లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అదే విధంగా పలువురిని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమం లో డీఆర్డీవో పీడీ, మండల ప్రత్యేక అధికారి సాయన్న, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీ డీవో భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు ముఖడే ఉత్తం, నాయకులు సోమోరే నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్ సదస్సుకు వెళ్లిన బోథ్ యువకుడు

బోథ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌటా(బీ) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్ జమ్ముకాశ్మీర్‌లో జరుగుతున్న యూత్‌సదస్సులో పాల్గొన్నారు. 25 నుంచి ప్రారంభమైన సదస్సు 30 వరకు కొనసాగనుంది. కార్యక్రమంలో జమ్ముకాశ్మీర్ నుంచి వచ్చిన యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుమారి స్మిత, సూపరింటెండెంట్ ఆర్కాలజీ తెలంగాణ నుంచి పాల్గొన్నారు. ఏఆర్ విజయరావు యువజన క్రీడా మంత్రిత్వ శాఖ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఖుష్బూ గుప్తా, డివైవో సుశీల్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా : ఎమ్మెల్యే

బోథ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కౌటా (బి) గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. బోథ్ నియోజకవర్గం పరిధిలోని అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో మంజూరు అయిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, సోనాల గ్రామ మాజీ సర్పంచ్ సి.సదానందం, గ్రామ మాజీ సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్ చిలకాడి రవీందర్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ స్వామి ఉన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, దశల వారీగా నిధులు మంజూరు చేయించి గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పిప్పలదరి గ్రామ పంచాయితీ భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక మాజీసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, పంచాయితీ రాజ్ శివరాం, డీఈ ధర్మేందర్, ఏఈ చంద్రశేఖర్, ఎంపీడీవో రమేష్, ఏటీఎం జగదేవ్, బోథ్ పట్టణ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూలీలను ఎమ్మెల్యే శాలువా లతో సన్మానించారు.

ఇచ్చోడ: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ఓటు ద్వారానే ప్రజల జీవితాల మార్పు జరుగుతుందని శాసన సభ్యులు అనిల్ జాదవ్ అన్నారు. స్థానిక విద్యాలయా పాఠశాలలో జరిగిన మాక్ పోలింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యార్థులకు ప్రజాస్వామ్యం గురించి ఓటుగురించి అవగాహన కల్పించారు. స్వయంగా తాను ఓటు వేసి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఇచ్చోడ మండలంలో ఉత్తమ గ్రామంగా నర్సాపూర్ గ్రామంను తీర్చిదిద్దుతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయితీ భవనానికి రూ.20లక్షలతో, అంగన్‌వాడీ భవనానికి రూ.12 లక్షల నిధులతో నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులను శాలువాతో సన్మానించారు.

తలమడుగు : నియోజకవర్గంలో కలిసిమెలిసి అభివృద్ధి చేసుకుందామని బరంపూర్‌ను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో నూతనంగా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

నేరడిగొండ : మండలంలోని రాజుర గ్రామంలో గల జగదాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలతో భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఈ సందర్భంగా భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అధికారులు శాలువాతో సన్మానించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గ్రామస్థులతో అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే గ్రామంలో పుట్టి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటి సారిగా కొబ్బరికాయ కొట్టానని గ్రామానికి 8 కోట్లతో సెంట్రల్ లైటింగ్‌తో రోడ్డుపనులను ప్రారంభించామని అన్నారు. రానున్న రోజుల్లో ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీఓ లక్ష్మణ్, తహసీల్దార్ కలీం, ఏపీఓ వసంత్‌రావ్, ఏపీఎం ఉత్తమ్, పశువైద్యాధికారులు రాథోడ్ జీవన్, సుశీల్‌కుమార్, నాయకులు సవాయి రామ్, రమేష్‌జాదవ్, నానక్‌సింగ్ పాల్గొన్నారు.



మాక్‌పోలింగ్‌లో బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నిబంధనలు పాటించకపోతే ఉపేక్షించం

● డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ ●డయాగ్నోస్టిక్ సెంటర్ల తనిఖీ



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు పాటించకపోవడంపై 'స్కానింగ్ సెంటర్ల దోపిడీ' పేరిట ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితం అయింది. ఈ కథనానికి డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ స్పందించారు. మంగళవారం పట్టణంలోని త్రినేత్ర డయాగ్నొస్టిక్ సెంటర్‌తోపాటు మరికొన్ని సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేట్ చార్ట్, రిజిష్టర్లను పరిశీలించి వాటిని రెగ్యులర్‌గా మెయింటేన్ చేయాలని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వం సూచించిన నిబంధనలను ఉప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే ఎవరినైనా ఉపేక్షించేది లేదని డీఎంహెచ్ఓ హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది రాం ప్రసాద్ పాల్గొన్నారు.

సర్వేపై అధికారుల పర్యవేక్షణ

తాంసి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 20 రోజుల నుంచి కుటుంబ సర్వే నిర్వహించిన వివరాలను కంప్యూటర్‌లో నమోదుచేస్తున్నారు. ఎలా నమోదు చేస్తున్నారో మంగళవారం మండల ప్రత్యేక అధికారి వెంకట రమణ, ఎంపీడీవో మోహన్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఇప్పటివరకు ఎన్ని కుటుంబాల పేర్లు, కంప్యూటర్‌లో నమోదయ్యాయో పరిశీలించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు.

తాంసీ ఎస్ఐగా రాధిక

తాంసి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల నుంచి తాంసీ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శివరాం మంగళవారం బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో బేల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాధికను ఎస్పీ నియమించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైని పలువురు గ్రామస్తులు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసులంటే ప్రజలేనని పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్సి(బీ) తండా పాఠశాలకు ఉపాధ్యాయుని నియామకం

తలమడుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలని పల్సి(బి) తండా పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు సార్ మీటింగ్‌కు వెళితే పాఠశాలకు సెలవే అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం కావడంతో ఐటీడీఏ అధికారులు స్పందించారు. పల్సి(బీ) తండా పాఠశాలకు మరో ఉపాధ్యాయున్ని నియమించారు. దీంతో పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జి సరస్వతి మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత విషయాన్ని పీవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. అదే విధంగా పాఠశాలకు సీఆర్టీలను నియమించే వరకు అశోక్ అనే ఉపాధ్యాయున్ని పంపించడం జరిగిందన్నారు.



పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలో 98,000 మంది గృహజ్యోతి లబ్ధిదారులు

జిల్లాలో 98,000 మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నారని ఆదిలాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.



● ఆదిలాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి):

ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో జిల్లాలో ఎంత మంది లబ్ధిదారులకు అందుతుంది..?

ఎస్ఈ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద జిల్లాఓల 98వేల మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్‌ను సరఫరా చేస్తున్నాం. దీని ద్వారా విద్యుత్ శాఖకు ప్రభుత్వం ప్రతినెల 4కోట్లను చెల్లిస్తుంది.

ప్రశ్న: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సేవలను అందిస్తున్నారు..?

ఎస్ఈ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేందుకు నిరంతరంగా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇటీవలే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పై టోల్ ఫ్రీ నెంబర్ 1912ను ముద్రించి సత్వర సేవలు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఎవరైనా ఈ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: గృహజ్యోతి పథకానికి కొత్తగా ఎలా దరఖాస్తు చేసుకోవాలి..??

ఎస్ఈ: గతంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికి ప్రభుత్వం గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. సం బంధిత మండల ఎంపీడీఓ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ప్రశ్న: కొత్తగా విద్యుత్ కనెక్షన్ తీసుకునేం దుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి...?

ఎస్ఈ: ఏదైనా గుర్తింపు కార్డు ఆధారంగా కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 30 వరకు రూ.938చెల్లిస్తే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తాం.

ప్రశ్న: గిరిజన రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరులో కొంత ఆలస్యం జరుగుతుంది ?

ఎస్ఈ: అలాంటిది ఏమి లేదు. నిబంధనల ప్రకారమే విద్యుత్ ట్రాన్స్‌ఫా ర్మర్లను మంజూరు చేస్తున్నాం. ఇటీవలే జిల్లాలో 132 మంది రైతులకు ఎస్‌డీఎఫ్ నిధు ల కింద కొత్త ట్రాన్స్ ఫార్మర్లను మంజూరు చేయాలని ఉన్నత అధి కారులను నివేదిక పంపించాం.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయాధికారి బోనగిరి సౌజన్య



మాట్లాడుతున్న న్యాయాధికారి

తలమడుగు, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : భారత రాజ్యాంగం కల్పించిన చట్టాల పై విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే అవ గాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయాధికారి బోనగిరి సౌజన్య కోరారు. మంగళవారం మం డల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్క రిం చుకుని జడ్పీఎస్ఎస్ తలమడుగు పాఠశా లలో న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన, న్యాయ సహాయం ఎలా పొందవచ్చు తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో జి.వెంకట్‌రావు, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్, తహసీల్దార్ రాజ్ మోహన్, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రాజ్యాంగాన్ని గౌరవించాలని మండల ఎంఈవో రాథోడ్ మానుకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భారత రాజ్యంగ దినోత్సవం వేడుకల్లో ముందుగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయితీ ఆవరణలో ఈవో సంజీవ్‌రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీం ఆర్మీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు వ్యాస రచన పోటీల్లో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంమోహన్‌రావు, పంచాయితీ ఈవో సంజీవరావు, భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు షకీల్, ఖానాపూర్ నియోజకవర్గం భీం ఆర్మీ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, మండల అధ్యక్షుడు సూర్యవంశీ, ఉత్తం, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే, మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, దళిత సంఘాల నాయకులు కాంబ్లే ఉత్తం, పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో యూనిట్ అధికారులు, ఉద్యోగులు హాజరై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, పరిపాలన అధికారి దామోదర్ స్వామి, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేన్ మండల అధ్యక్షుడు మస్కే మాధవ్, డీఎస్పీ మండల అధ్యక్షుడు బడుగు రాజే శ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాల్యాల పాల్గొన్నారు.

తాంసి: తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనం గా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ నాయబ్ తహసీల్దార్ గణేష్ జాదవ్, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ ధారవేణి పాల్గొన్నారు.

భీంపూర్: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నలంద ప్రియ, మండల పరిషత్‌లో ఎంపీడీవో గోపాల కృష్ణరెడ్డి, పంచాయితీ కార్యాలయాల్లో కార్యదర్శులు అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు.

తలమడుగు : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజమోహన్,ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌లు, ఆయా శాఖల అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తలమడుగు గ్రామ ఉపాధ్యక్షులు కాడే శశివర్ధన్, మాజీ ఎంపీటీసీ చంటి, మండల కేంద్రంలోని మాల, మహర్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాట్లాడుతూ తన కుటుంబాన్ని సైతం లెక్క చేయకుండా దేశానికి రాజ్యాంగం అందించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కృషి చేయాలని కోరారు.

ఇచ్చోడ : మండలంలోని తలమద్రిలో జడ్పీసీఈఓ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

గుడిహత్నూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతాపూర్‌లో నూతనంగా నిర్మించే అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకు ముందు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్మికులను శాలువాలతో సన్మానించి వారు చేసిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అహ్మద్ అబ్దుల్‌హై, ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ తిరుమల్‌గౌడ్, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జన వాల్‌పోసర్ల విడుదల

బోథ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరగబోయే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాలల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎలక రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం కోశాదికారి బోడ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ మునేశ్వర్, సోమన్న, సురేందర్, భూషణ్‌లతో పాటు కనుగుట్ట, దన్నూర్ గ్రామాల మాల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పశువుల కొట్టం దగ్ధం

ఉట్నూర్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని పెద్ద గంగాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా మూడు పశువులు సజీవ దగ్ధం అయిన సంఘటన చోటు చేసుకుంది. పెద్ద గంగాపూర్‌కు చెందిన రైతుసాయన్న తన ఇంటి ఆవరణలో ఉన్న పశువుల కొట్టంలో ఎద్దుల జతతో పాటు ఒక ఆవును రోజు లాగే కట్టి వేశారు. సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకోవడం వల్ల పశువులు మృతి చెందాయని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదం వల్ల రెండు లక్షల వరకు నష్టం జరిగిందని సాయన్న తెలిపారు.

'గిరిజన బాలిక మృతిపై విచారణ జరపాలి'

బోథ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి బాధాకరమైన విషయమని ఆమె మృతిపై విచారణ జరిపించాలని ఆత్మ మాజీ ఛైర్మన్ మల్లెపూల సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో 23 రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థికి సంతాపం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో సరైన వసతులు లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

బోథ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి సోనాల మండలాన్ని ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువరించారని, అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. అధికారులు మండలంలో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అయితే తాను ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రులు తీసుకువెళ్తానని అప్పటికీ ఏర్పాటు కాకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుందన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన

ఇంద్రవెల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయితీ ఈవో సంజీవ్‌రావు, ఏఎస్సై కాత్లే భీంరావు, కళాజాతబృందం సభ్యులు ఆత్రం గోవిందరావు, శంకర్, అశిష్, నగేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

తలమడుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి గజానన్ కోరారు. మంగళవారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయితీ సెక్రటరీ గజానంద్, ఏపీవో మేఘమాల పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రెవెన్యూ, పౌరసరఫరాల, వ్యవసాయ శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్ణీత గడువు లోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులందరూ ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా వరి ధాన్యాన్ని శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు, రానున్న కొద్దిరోజుల్లోనే అదనంగా మరికొన్ని యంత్రాలను సమకూరుస్తామన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు రైతుల నుంచి సేకరించిన సన్న, దొడ్డు రకపు వరి ధాన్యంపు వివరాలు, ట్యాబ్ ఎంట్రీ, రైతుల ఖాతాల్లో జమ చేసిన డబ్బు, తదితర వివరాలను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్లు, అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ రిపోర్టులను అందజేయాలన్నారు. ధాన్యం పక్కదోవ పట్టకుండా అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా వ్యవస్థను కొనసాగించాలన్నారు. పౌర సరఫరాల, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించబోయే రైతు పండగ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లను చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో ధాన్యం కొనుగోలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించిన వివరాలు, ట్యాబ్ ఎంట్రీ, రైతుల ఖాతాల్లో జమ చేసిన నగదు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడినన్ని గన్ని బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్‌లు, సీపీవో జీవరత్నం, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీవో రాజమల్లు, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సలహాదారుడిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు మంగళవారం భేటీ అయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ ఆయన వెంట ఉన్నారు. నిర్మల్ మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయించాలని ఆయనను కోరారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

కుంటాల, నవంబర్, 26 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలతో పాటు అంబకంటిలో కొనుగోలు కేంద్రాలను మంగళవారం పౌరసరఫరాల శాఖ డీఎం గోపాల్ తనిఖీ చేశారు. ఈయన వెంట కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ఇథనాల్'పై ఆందోళన ఉద్రిక్తం

● కారులో ఆర్డీవో ఏడుగంటల పాటు నిర్బంధం ● క్షీణించిన ఆరోగ్యం.. వైద్య పరీక్షలు.. ● రక్షణ వలయంతో ఆర్డీవోను తీసుకెళ్లిన పోలీసులు ● కోపోద్రిక్తులైన నిరసనకారులు.. ఆర్డీవో కారు ధ్వంసం ● ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుని తీరుతాం ● దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థుల ప్రకటన

దిలావర్‌పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా జాతీయ రహదారిపై చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మధ్యాహ్నం మూడు గంటలకు ఆందోళనకారులతో మాట్లాడేందుకు వచ్చిన ఆర్డీవో రత్నకల్యాణిని దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మహిళలు అడ్డుకున్నారు. దీంతో అప్పటి నుంచి రాత్రి 10 గంటల వరకు ఆమె కారులోనే కూర్చుండిపోయారు. ఆర్డీవోను బయటకు రాకుండా జనం అడ్డుకున్నారు. కలెక్టర్ వచ్చే వరకు ఆర్డీవోను వదిలేది లేదని నిరసనకారులు తెగేసి చెప్పారు. పోలీసులు ఎంత సర్ది చెప్పినా.. వారు వినలేదు. కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇస్తే తప్ప ఆందోళన విరమించేది లేదన్నారు. ఇదే సమయంలో ఆర్డీవో రత్నకళ్యాణి ఆరోగ్యం కొంతమేర క్షీణించింది. దీంతో రాత్రి 9 గంటలకు వైద్యులు వచ్చి ఆర్డీవోకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత రాత్రి 10 గంటల వరకు నిరసనకారుల నిర్బంధంలో ఉన్న ఆర్డీవో రత్నకల్యాణిని విడిపించేందుకు నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల ఆదేశాలతో పోలీసులు భారీ వలయంగా ఏర్పడి ఆమెను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. కోపోద్రిక్తులైన ఆందోళనకారులు ఆర్డీవో కారును ధ్వంసం చేశారు. చివరకు పోలీసులు అతి కష్టమ్మీద ఆర్డీవోను క్షేమంగా కారు నుంచి దించి.. పోలీసు వాహనంలో నిర్మల్‌కు తరలించారు. కాగా.. ముందు జాగ్రత్త చర్యగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు దిలావర్‌పూర్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వలయంగా ఏర్పడి డీఆర్‌వోను కారులో నుంచి దించుతున్న పోలీసులు

● 61వ జాతీయ రహదారిపై బైఠాయించిన మహిళలు

జిల్లాలోని దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుని తీరుతామని ఆయా గ్రామాల మహిళలు మూకుమ్మడిగా ప్రకటించారు. పరిశ్రమ రద్దు చేసే వరకూ తమ పోరాటం ఆగదన్నారు. దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య చేపట్టిన ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం రెండు గ్రామాల మహిళలు దిలావర్‌పూర్‌లో గల 61వ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఉదయం 11 గంటలకు రోడ్డెక్కిన మహిళలు, ఉద్యమకారులు రాత్రి 10గంటలు దాటినప్పటికీ అక్కడే బైఠాయించారు. ఇక్కడే నిద్రపోతామని భీష్మించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. ఇథనాల్ పరిశ్రమను రద్దును చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా తాము శాంతియుతంగా పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని, ఇథనాల్ పరిశ్రమ రద్దు కావడమే తమ ఎజెండా అని అన్నారు. తాము నమ్ముకుని ఓట్లేసిన నాయకులు ప్రస్తుతం ముఖం చాటేశారన్నారు. ఎన్నికలకు ముందు ఇథనాల్ పరిశ్రమ రద్దుకు కృషి చేస్తామని చెప్పిన ముగ్గురు నాయకులు.. ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు కూడా వారికి తీరిక లేదా అని ప్రశ్నించారు. వారంతా ఒక్కటేనని తమకు ఇప్పుడు అర్థమైందన్నారు. కాగా.. గత కొన్ని రోజులుగా దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనపై ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేసినట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ల్యాండ్రీషాప్ దగ్ధం

భైంసా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత సినిమా టాకీస్ సమీపంలో గల సాయిరాణి డ్రై క్లీనింగ్ అండ్ ల్యాండ్రీ షాపులో సోమవారం అర్ధరాత్రి వేళలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ల్యాండ్రీషాపులో డ్రై క్లీనింగ్, ఐరన్ (ఈస్త్రీ)చేయించేందుకు 150 మందికి పైగా కష్టమర్లు ఇచ్చిన 350 పైగా దుస్తుల జతలు, ఫర్నిచర్‌తో సహ ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న యజమాని సంటోళ్ల అనిల్ ఘటన స్థలికి చేరుకొని మంటలను ఆర్పివేసేందుకు విఫలయత్నం చెందాడు. అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపకశాఖకు సమాచారం అందించాడు. ఫైర్‌ఇంజన్‌తో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసారు. అప్పటికే దుస్తులతో పాటు ఫర్నిచర్, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి.

రత్నాపూర్ కాండ్లీ పాఠశాలను సందర్శించిన డీఈవో

సోన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పరిసరాలు, తరగతి గదులు, ఆట స్థలం, మొదలైన వాటిని పరిశీలించారు. విద్యార్థుల హాజరును మెరుగుపరచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సరుకులతో మెనూ ప్రకారం చక్కటి భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు వ్యాయామ పిరియడ్ కేటాయించాలని, పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు, ప్రత్యేక తరగతులకు హాజరుకావాలని, ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు చక్కగా అవగాహన చేసుకొని ప్రతిరోజు స్లిప్ టెస్టులు రాయాలని సూచించారు.

వాహనాల దారి మళ్లింపు

కుంటాల, నవంబరు 26 : (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రం దిలావర్‌పూర్ గుండం పల్లి రహదారి ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు నిరసనగా మంగళవారం భైంసా- నిర్మల్ రహదారిపై అక్కడి రైతులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. దీంతో భైంసా- నిర్మల్ 61వ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. భైంసా రూరల్ సీఐ నైలు, కుంటాల ఎస్సై భాస్కరాచారిల ఆధ్వర్యంలో రహదారిపై ట్రాఫిక్ స్తంభించకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా రోడ్డు పక్కన భారీ వాహనాలను నిలిపివేసి అత్య వసర వాహనాలను భైంసా నుంచి నిర్మల్ వెళ్లేందుకు కుంటాల, గొల్లమాడ మీదుగా వెళ్లేందుకు వాహనాలను దారి మళ్లించారు. కిలోమీటర్ల మేర వాహనాలు రోడ్డు పక్కన నిలిచిపోయాయి.

బాధిత కుటుంబానికి రూ.3.39 లక్షల విరాళం

లక్ష్మణచాంద, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల గణేష్ కుటుంబానికి రూ. 3.39 లక్షల విరాళాన్ని మంగళవారం అందించారు. ఆకుల గణేష్ గల్ఫ్ దేశానికి వెళ్లి గుండెపోటుతో మరణించిన సంగతి అందరికీ తెలిసిందే. ఆర్థికంగా బలహీన పడిన ఆ కుటుంబాన్ని ఆదుకోవటం కోసం మల్లాపూర్ గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులు విరాళంగా రూ. 3,39,227 లను జమ చేశారు. ఇందులో నుండి అంత్యక్రియలకు 33,500లు ఖర్చు పోగా మిగతా మొత్తం రూ. 3,08,727ను మృతుడి తండ్రి ఆకుల పెంటయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశం రమేష్, మాజీ సర్పంచ్ అడిచెర్ల రవికుమార్, నాయకులు దేవర్ల భీమేష్, బొజ్జ మల్లేష్, గొర్రె ఆశన్న, నారాయణ, తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో సమర్థవంత సేవలు

● ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తామని జిల్లా ఎస్పీ జానకీషర్మిల స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ వేడుకను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గుర్తింపు పొందిందన్నారు. దేశంలోని ప్రజలందరికీ ప్రాథమిక హక్కులు కల్పిస్తూ చట్టాలను రూపొందించిందన్నారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పని చేస్తోందన్నారు. సమాజ అభివృద్ధిలో పోలీసులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, ఏవో యూనిస్ అలీ, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో రాజ్యాంగ దినోత్సవం

బాసర, నవంబర్, 26 : (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్‌కు పూలమాల వేసి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ముఖ్య అతిథిగా హాజరైన ఐఐఎఫ్‌టీ డిల్లీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళి దర్శన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం గొప్పతనం భారత దేశంలో రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేశారు.

ముథోల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ ం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సందీప్ దుగ్గే మాట్లాడుతూ డా. బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దౌలత్, బంకబాబు, ప్రకాష్, రాహుల్, దిగంబర్, సునీల్, తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

నిర్మల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని లోకేశ్వరం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంతో పాటు వివిధ పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా లోకేశ్వరం మండలంలోని రాజూర గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మా అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించారు.

భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి : బీజేపీ

నిర్మల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని బీజేపీ అధ్యక్షుడు కే.అంజుకుమార్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ వేడుకలను నిర్వహించారు.



● పిచ్చిచెట్లతో నిండిపోయిన మార్కెట్ యార్డు



● మార్కెట్‌లోని ఒకటవ గిడ్డంగి ఇలా..




● మార్కెట్‌లోని రెండవ గిడ్డంగి దుస్థితి

ఫోకస్

ఉప మార్కెట్ ఉన్నా.. ఉపయోగం సున్నా!

● అలంకారప్రాయంగా మారిన ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లోని ఉప మార్కెట్ ● ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతుల ప్రయోజనార్థం ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు
● ఇప్పటికీ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జనరల్ మార్కెట్ పరిధిలోనే కొనసాగింపు ● ఇప్పటి వరకు మార్కెట్ కమిటీ ఆవరణలో కొనుగోళ్లు జరగలేదని వాపోతున్న రైతులు



● హస్నాపూర్‌లోని సబ్ మార్కెట్ యార్డు

ఉట్నూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల రైతులకు ప్రయోజనం కల్పించాలని ఏర్పాటు చేసిన ఉప మార్కెట్‌తో ఎలాంటి ఉపయోగం లేదని ఉట్నూర్ మండల రైతులు వాపోతున్నారు. ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌లో ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఉపమార్కెట్ అలంకారప్రాయంగా మారింది. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మార్కెట్ కమిటీ పరిధిలో హస్నాపూర్ సబ్ మార్కెట్ యార్డును ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఉప మార్కెట్లో గిడ్డంగులను లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించారు.

గిడ్డంగులున్నా.. పంట నిలవలేదు

సబ్ మార్కెట్ యార్డులో నిర్మించిన గిడ్డంగులలో రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులు నిలువ చేసుకునే అవకాశం ఉంటుంది. రైతులకు గిట్టుబాటు ధర లభించినప్పుడు రైతులు తమ పంటలను అమ్ముకునే వీలు కల్పించాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీపై ఉంటుంది. రైతులు పంటలు నిలువ చేసినప్పుడు 70శాతం డబ్బులను రైతులకు మార్కెట్ కమిటీ ద్వారా ఇవ్వాల్సి ఉంటుంది. కాని గిరిజన ప్రాంతాల రైతులకు ఇవి తెలియజేయాల్సిన బాధ్యత ఉన్న మార్కెట్ కమిటీ అధికారులు ఏ మాత్రం అవగాహన కల్పించడం లేదు. గిడ్డంగులు కేవలం పౌరసరఫరాల గిడ్డంగులుగా మారాయని రైతులు అంటున్నారు. ఈ సబ్ మార్కెట్ కమిటీ ఆవరణలో ఇంత వరకు ఎప్పుడు కొనుగోళ్లు జరగలేదని రైతులు వాపోతున్నారు.

బహిర్భూమిగా మారిన సబ్ మార్కెట్‌యార్డు

ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌లో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన సబ్‌మార్కెట్‌యార్డు పిచ్చిమొక్కలు పిచ్చి చెట్లతో నిండి పోవడంతో బహిర్భూమిగా ఈ ప్రాంత వాసులు వాడుతున్నారు. ఇదేకాకుండా సబ్‌మార్కెటింగ్‌యార్డు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డగా మారిందని పలువురు పేర్కొంటున్నారు..

ఉమ్మడి జిల్లాలోనే ఇంకా సబ్ మార్కెట్

తెలంగాణ రాష్ట్రం వచ్చాక అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లాను నాలుగు జిల్లాలుగా విభజించిన ప్రభుత్వం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మార్కెట్ కమిటీని విభజించలేక పోయింది. ఫలితంగా ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లాలో ఉన్న జైనూర్ మార్కెట్ కమిటీ పరిధిలోనే హస్నాపూర్ సబ్ మార్కెట్‌యార్డు కొనసాగుతుంది. జిల్లాలు ఏర్పడి దశాబ్దం గడుస్తున్న ప్రభుత్వం ఏ జిల్లాకున్న ఆసబ్ మార్కెట్‌ను ఆ జిల్లాలకు బదిలీ చేయాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్ మార్కెట్ యార్డులను ఆయా జిల్లాల పరిధిలోకి బదిలీ చేయాలని, సబ్ మార్కెట్లలో రైతుల పంటలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్ పరిధిలో కొనుగోళ్లు జరిగేలా చూస్తాం

: రాధాబాయి, ఏఎంసీ, డైరెక్టర్



జైనూర్ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న హస్నాపూర్ సబ్ మార్కెట్ యార్డులో రైతుల పంటలు కొనుగోలు చరేసేలా చూస్తాం. అదేవిధంగా సబ్ మార్కెటింగ్‌యార్డును శుభ్రపరిచి రైతుల పంటలు కొనుగోలు చేయడానికి వీలుగా ఎమ్మెల్యే బొజ్జుపటేల్ దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి చేస్తాం.

రోడ్డు విస్తరణ పనులకు ఇక్కట్లు

■ ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనే ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్ ■ ఆర్‌అండ్‌బీ, పోలీసు శాఖల మధ్య సమన్వయం కరువు ■ ట్రాఫిక్ ఆటంకాలతో ముందుకు సాగని పనులు ■ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు

ఇచ్చోడ, నవంబరు, 26(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ప్రధాన రహదారిపై ఓ పక్క రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుంటే.. మరో పక్క ట్రాఫిక్ సమస్య తీవ్రతరంగా మారింది. ప్రధాన రహదారిపైరే ఇష్టారాజ్యంగా చాలా మంది పార్కింగ్ అవసరాలకు వాడుకుంటున్నారు. పనులు నడిచే రోడ్లపై దర్జాగా వందలాది వాహనాలు పార్క్ చేస్తున్నా.. ట్రాఫిక్ పట్ల పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇందుకు ఉదాహరణ గేర్జం, నర్సాపూర్, సిరిచెల్మ, దరంపూరి, మల్యాల ఆటోల స్టాండ్‌ను దర్జాగా రోడ్డుపైనే నిలిపడంతో పనులకు అంతరాయం కలుగుతుంది. ఈ ప్రాంతంలోనే పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తుంటారు. అక్కడే రోడ్డుపై అక్రమంగా వాహనాలు నిలుపుతున్నా కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నో పార్కింగ్ అంటూ పోలీసులు ఏర్పాటుచేసిన సూచిక బోర్డులు సైతం పట్టించుకోకుండా అక్కడే వాహనాలు నిలపుతున్నారు. ఇచ్చోడ ప్రధాన రహదారులపై యథేచ్ఛగా వాహనాల పార్కింగ్‌కు వాడుకుంటున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం శోచనీయం. రోడ్డుపై తొపుడు బండ్లు, చిరువ్యాపారులు సాగిస్తుండడంతో రోడ్డు పనులు జరిగే సమయంలో జరగరాని ఆపాయం జరిగితే బాధ్యులేవరనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి? ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి చొరవ తీసుకోకపోవడం గమనార్హం. వారం రోజుల పాటు ట్రాఫిక్ సమస్యను నిరోదిస్తే ఓ పక్క తారు రోడ్డు పూర్తవుతుంది. దీంతో రోడ్డు పనులు మెరుగుపడనుంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌ను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న ఆటోలు

■ ఆంధ్రజ్యోతి పరిశీలన



రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయంటూ సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన గుత్తేదారు



ఇచ్చోడలో ఓ పక్క రహదారి విస్తరణ పనులు నడుస్తుంటే.. ఆ వెంటనే వాహనదారులు ఇష్టారాజ్యంగా రోడ్డు పనులకు వాహనాలను అడ్డంగా నిలిపారిలా..

కొత్త విద్యుత్ మీటరు రూ.938

● ఈనెల 30తో ముగియనున్న గడువు

■ మీ కోసం..



భైంసా, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబానికి విద్యుత్తు మీటరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను కొత్తగా విద్యుత్తు సర్వీసు (మీటరు)ను రూ.938కే అందిస్తున్నారు. రెండు నెలల కిందట ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వాస్తవానికి కిందటి నెలతో ఈ పథకం ముగిసింది. ఇంకా చాలా మంది కొత్త కనెక్షన్లు పొందాల్సి ఉండటంతో గడువును ఈ నెల 30 వరకు పొడిగించింది. ఇది వరకు బీపీఎల్ వారు కొత్త విద్యుత్ మీటర్ కోసం గాను రూ. 1518 చెల్లించేవారు. పేదలకు ఇది భారం అవుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధర తగ్గించింది. కొత్త సర్వీసు కావాల్సిన వారు ఆధార్, రేషన్ కార్డు, ఇంటి పత్రాల జిరాక్స్‌లు, రెండు పీపీ ఫోటోలతో మీ సేవలో సూచించిన రుసుం రూ.938 చెల్లిస్తే మీటరు మంజూరు చేస్తారు.

● నిర్మల్ జిల్లాలో..

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని జిల్లాలో సరిగా ఉపయోగించుకోవడం లేదు. మీటరు తగ్గింపు ధరపై ప్రచారం అంతగా జరగకపోవడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. గత రెండు నెలల్లో 1500 కొత్త సర్వీసులు పొందారు. విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన, ప్రచారం కల్పించి ఉంటే చాలా మంది ముందుకు వచ్చేవారు. తగ్గింపు ధరల గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు సబ్ స్టేషన్ల వారీగా విస్తృత ప్రచారం గావిస్తే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరుతుందంటున్నారు.

కుడి కాలువకు లీకేజీలు.. వృథాగా పోతున్న సాగు నీరు

■ జర దేఖో!!



ధన్నూరు గ్రామ సమీపంలో కరత్వాడ కుడి కాలువ లీకేజీలతో వృథాగా పోతున్న నీరు



కుడి కాలువ నుంచి లీకేజీ అవుతున్న సాగు నీరు ఇలా..

● ఆందోళన వ్యక్తం చేస్తున్న చివరి ఆయకట్టు రైతులు

భోథ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు కుడి కాలువ నుంచి బోథ్, దన్నూర్, కుచలాపూర్ గ్రామాల రైతాంగానికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో కరత్వాడ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను ఏర్పాటు చేశారు. నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఆశించిన లక్ష్యం నెరవేర్చడం లేదు.

అన్నీ లీకేజీలే..

కరత్వాడ ప్రాజెక్టు నుంచి నిర్మించిన కుడి, ఎడమ కాలువల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించడం లేదు. మరమ్మతులకు నిధులు రాకపోవడంతో కాలువల్లో పిచ్చి మొక్కలతో నిండి పగుళ్ళు ఏర్పడుతున్నాయి. ఫలితంగా రైతులకు సాగునీరు అందకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. ఎడమ కాలువకు లీకేజీలతో పాటు అక్కడ కొంత మంది రైతులు గండి కొట్టడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదు. ఇక కుడి కాలువకు లీకేజీలు ఉండటంతో సాగునీరు చివరాయకట్టు రైతుకు కలగానే మిగిలింది.

'నిధులు రాగానే మరమ్మతులు చేపడతాం'

కరత్వాడ ప్రాజెక్టు కాలువ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని ఇరిగేషన్ ఏఈ ప్రకాష్ తెలిపారు. లీకేజీలను గుర్తించడం జరిగిందని నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.





గంజాయికి అడ్డుకట్ట

నిర్మల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత కొంతకాలం నుంచి గంజాయి దిగుమతి, వినియోగంతో పాటు దాని సాగుకూడా విపరీతంగా పెరిగిపోతుండడాన్ని జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే పలుమార్లు దాడులు జరిపి పెద్ద ఎత్తున గంజాయిని పట్టుకోవడమే కాకుండా పలువురిపై కేసులు సైతం నమోదు చేశారు. అయినప్పటికి పరిస్థితుల్లో ఆశించితనంగా మార్పురాకపోతుండడం పట్ల ఎస్పీ ఇక సీరియస్ కార్యాచరణకు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగానే ఆపరేషన్ గాంజా పేరిట ఎస్పీ గంజాయి అడ్డాలుగా గుర్తింపు పొందిన ఏరియాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు. ఇందులో భాగంగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలపై మొదట దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఇన్‌ఫార్మర్లు అందించిన సమాచారం మేరకు నిర్మల్ పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పోలీసు జాగిలాలను రంగంలోకి దించి విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. కాలనీ శివారు ప్రాంతాల్లోనూ, ఇళ్ళల్లోనూ అలాగే పాత ఇంటి భవనాల్లోనూ, ఆటోలు, కార్లు లాంటి వాహనాలను సైతం జాగిలాలతో తనిఖీ చేయించారు. అయితే ఈ తనిఖీల్లో గంజాయి పట్టుబడనప్పటికీ ఆ ప్రాంతంలో గంజాయి అమ్మే వారిలో మాత్రం భయాందోళనలు నెలకొని ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. దీంతో పాటు పాత నిందితుల ఇళ్లకు వెళ్లిన పోలీసులు వారికి కౌన్సిలింగ్‌తో పాటు గంజాయి వల్ల కలిగే నష్టాన్ని వివరించి అవగాహన కల్పించారు.

ఇక నుంచి ఇన్‌ఫార్మర్ల సహకారం

గంజాయితో పాటు ఇతర మారక ద్రవ్యాల విక్రయాలు, రవాణా, సాగుతో పాటు వినియోగాన్ని అరికట్టేందుకు అనుమానిత ప్రాంతాల్లో ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్‌ను విస్తృతం చేయాలని పోలీసులు నిర్ధారించారు. పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాల్లో ఈ ఇన్‌పార్మింగ్ నెట్‌వర్క్ ద్వారా గంజాయిలతో పాటు డ్రగ్స్ అమ్మే వారిపైనే కాకుండా వాటిని విక్రయించే వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించనున్నారు. దీనికి అనుగుణంగా ఇక వరుస దాడులను చేపట్టి గంజాయి వినియోగాన్ని, అమ్మకాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని పోలీసులు నిర్ణయించారు. రాబోయే ఆరు నెలల పాటు ఇక ఆపరేషన్ గాంజాను నిరాటకంగా కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇక నిరంతర డాగ్‌స్క్వార్డ్ తనిఖీలు

కాగా జిల్లా వ్యాప్తంగా గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లతో పాటు పెద్ద మొత్తంలో సరఫరా జరుగుతున్న ప్రాంతాల్లో ఇక నిరంతర తనిఖీలను చేపట్టేందుకు ఎస్పీ కార్యాచరణ రూపొందించారు. దీనికి అనుగుణంగానే ఇటు ఇన్‌ఫార్మర్‌లు అందించే సమాచారంతో పాటు ప్రత్యేక పోలీసు బృందాల చేత తనిఖీలను చేపట్టనున్నారు. దీంతో పాటు ఆకస్మిక తనిఖీలకు సరికొత్త విధానాన్ని అమలు చేయబోతున్నారు. ఇందులో భాగంగానే పోలీసు జాగిలాలతో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎవరికి అనుమానం రాకుండా పోలీసు జాగిలాలను రంగంలోకి దించి శివారు ప్రాంతాలతో పాటు వాహనాల తనిఖీలు కూడా చేపట్టనున్నారు. ఇప్పటికే పలుసార్లు డాగ్‌స్క్వార్డ్‌లతో ప్రయోగాత్మకంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను ఇక నిరాటకంగా కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

- నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్న పోలీసులు
- ఇక పకడ్బందీ ముకుతాడు బిగించే వ్యూహం
- సరఫరా, అమ్మకాలపై ఇక కఠిన నిఘా
- అనుమానిత ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు
- జిల్లావ్యాప్తంగా ఇన్‌ఫార్మర్‌ల నియామకం
- పాత నిందితులకు కౌన్సిలింగ్‌లు

పాత నిందితులకు కౌన్సిలింగ్‌లు

కాగా గంజాయి వినియోగం వల్ల జరిగే నష్టంపై పోలీసు శాఖ ఇప్పటికే జిల్లాస్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతున్న సంగతి తెలిసిందే. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన శిబిరాలను నిర్వహించి వారికి చైతన్యం కలిగిస్తున్నారు. దీంతో పాటు ఇప్పటికే గంజాయి సేవిస్తున్న వారిని గుర్తించిన పోలీసులు పలువురికి డీ అడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్సలు నిర్వహించి వారిని మామూలు స్థితికి తీసుకువచ్చారు. కాగా గంజాయి అమ్మకాలు, సరఫరా కేసుల్లో చిక్కుకున్న పాత నిందితులపై కూడా పోలీసులు దృష్టి సారిస్తున్నారు. వీరికి కుటుంబ సభ్యుల సహకారంతో కౌన్సిలింగ్‌లు నిర్వహించి వారిని అక్రమ గంజాయి వ్యాపారానికి దూరంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. దీని కోసం గానూ కొంతమంది పోలీసు సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.





జాగిలాలతో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

బాసర అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బాసర, నవంబర్, 26 : (ఆంధ్రజ్యోతి) బాసర సరస్వతీ అమ్మవారి హుండీ కానుకలను మంగళవారం దేవస్థాన అధికారులు లెక్కింపు చేపట్టారు. హుండీ కానుకల్లో నగదు రూ. కోటి 30 వేల 657, మిశ్రమ బంగారం 143 గ్రాములు, మిశ్రమ వెండి 4 కిలోల 250 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన 147 కరెన్సీలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం 89 రోజుల్లో ఆలయానికి సమకూరింది.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సదస్సు

నిర్మల్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో మంగళవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై ఒక్కరోజు వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ... వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఇక్కడ నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని ఆరోగ్య సహాయకులకు, ఆశా కార్యకర్తలకు తెలియజేయాలని కోరారు.

కుటుంబ నియంత్రణకు వాసెక్టమి పక్షోత్సవాలు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ... కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో మగవారి భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రతి సంవత్సరం వాసెక్టమి పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నవంబరు 21 నుండి డిసెంబరు 4 వరకు పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మగవారికి చేసే శాశ్వత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వాసెక్టమి సరళమైనది, సురక్షితమైనది, ప్రభావంతమైనది. దీని పట్ల మగవారిలో ఉన్న అప నమ్మకాలను, అనుమానాలను తొలగించి, వారు ఆపరేషన్ చేసుకునే విధంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నయనారెడ్డి, జోనల్ సర్వలెన్స్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ అతుల్, డాక్టర్ మురారి, సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

గుండంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద యువకుడిపై కత్తులతో దాడి



నర్సాపూర్(జి), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుండంపల్లి గ్రామానికి చెందిన కొండూరి శ్రీకాంత్(30)పై ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లే సమయంలో గుండంపల్లి గ్రామ ఎక్స్ రోడ్డు వద్దకు చేరుకోగానే ఇద్దరు వ్యక్తులు శ్రీకాంత్‌పై కత్తులతో దాడి చేశారని, మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మంగళవారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తండ్రి కొండూరి ముత్యం తెలిపారు. తన కుమారుడిని కత్తులతో దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దరఖాస్తులో కోరాడు.

వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు సన్నాహక సమావేశం

నిర్మల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లపై మంగళవారం డీఈవో రామారావు సన్నాహక సమావేవం ఏర్పాటు చేశారు. త్వరలో తేదీ ఖరారు. కమిటీలను ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. ఎంఈవోలు, సైన్స్ అధికారి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో యూనివర్సిటీ అధికారులు

బాసర, నవంబర్, 26 : (ఆంధ్రజ్యోతి) : సౌత్ జోన్ మహిళా కబడ్డీ పోటీలకు బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 29వ తేది నుంచి వచ్చే నెల 2వ తేది వరకు తమిళనాడులోని ఆలగప్ప విశ్వవిద్యాలయంలో ఈ పోటీలు జరగనున్నాయి. యూనివర్సిటీ స్థాయి విద్యార్థులు పాల్గొనే ఈ పోటీలకు సౌత్ జోన్ విశ్వవిద్యాలయం నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్దన్ ఏవో రణ ధీర్ అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ ఉపసంహరణ జరిగే వరకు అవిశ్రాంత పోరు


- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ముథోల్ సెగ్మెంట్ అధ్యక్షులు శంకర్‌చంద్రే



భైంసాలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ

భైంసా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ఎస్సీ వర్గీకరణను ఉపసంహరణ జరిగే వరకు అలుపెరుగని రీతిలో అవిశ్రాంతంగా పోరు కొనసాగిస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ సభ్యులు ముథోల్ సెగ్మెంట్ అధ్యక్షులు శంకర్ చంద్రే వెల్లడించారు. మంగళవారం భైంసాలో వచ్చె నెల 1న హైదరాబాద్‌లోని పెరెడ్ గ్రౌండ్స్‌లో జరుగనున్న మాలల సింహగర్జన సన్నద్ధ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా త్యాగాలతో కూడిన ఉద్యమ బాటకు సిద్ధమవ్వాలన్నారు. ఐక్యతతో పోరుబాట కొనసాగించి లక్ష్యాన్ని సాధించేంత వరకు విశ్రమించకూడదని సూచించారు. మాలల హక్కుల సాధన, ఆత్మగౌరం కోసం రాజీలేని రీతిలో ముందుకు సాగుదామని తెలిపారు. మాలల ఐక్యతను చాటి చెప్పేందుకు, వర్గీకరణ వ్యతిరేకంగా సమర శంఖరావాన్ని పూరించేందుకు గాను హైదరాబాద్‌లో వచ్చే నెల 1న జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేసేందుకు అధికసంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. మాల యువత గ్రామ గ్రామాన పర్యటించి జాతికి జరుగుతున్న అన్యాయాలను, వివక్షతను వివరిస్తూ జాగృతపరచాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ భారీగా ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ప్రతినిధులు మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లె, ఫైసేకర్ సాయిలు, ప్రసంజిత్ ఆగ్రే, దేవిదాస్ హస్నే, సాహెబ్‌రావ్, శ్రీనివాస్ జాడే, గిరిధర్ జంగ్మేలతో పాటు పలువురు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ ప్రతినిధులు

భైంసా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శీతకాలంలో ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని బీజేపీ భైంసా పట్టణ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, బీజేవైఎం ప్రతినిధి గంగాప్రసాద్‌ల ఆధ్వర్యంలో అర్‌డీవో కార్యాలయంలో సంబంధిత విషయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో ప్రస్తుతం వణికిస్తున్న చలితో విద్యార్థులు విలవిలాడిపోతున్నారని తెలిపారు. స్నానాలు అచరించేందుకు వేడినీటి వ్యవస్థ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చన్నీళ్లతో స్నానాలు సక్రమంగా చేయక చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని వాపోయారు. రాత్రి కప్పుకోవడానికి సరియైన దుప్పట్లు లేక చలి దాటికి గజగజ వణికి పోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు వేడి నీటి వ్యవస్థను కల్పించాలని, కప్పుకోవడానికి దుప్పట్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ ప్రతినిధులు వెంకటేష్, కాసర్ల ప్రవీణ్, బండారి దిలీప్, పలువురు పాల్గొన్నారు.

నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవాలి

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో యోగా కేంద్రం ప్రారంభోత్సవంలో కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిత్యజీవితంలో ప్రతీ ఒక్కరూ యోగాను భాగం చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగా శిక్షణ కేంద్రాన్ని వైద్యశాఖ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ప్రభుత్వం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రంలో యోగా నిపుణులు శిక్షణ ఇస్తారన్నారు. యోగా శిక్షణ కేంద్రానికి అనుబంధంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 10 యోగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలందరికీ యోగా చేరువయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, ఆర్ఎంవో సుమలత, ఆయుష్ విభాగం వైద్యాధికారి గంగాదాస్, డీసీహెచ్‌వో డా. సురేష్, తహసీల్దార్ రాజు, అధికారులు, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశమే లేదు

ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) ట్యాంపరింగ్ చేయబడవని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టి వేసిందని, ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తి చూపిందని తెలిపారు.

భూసేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీకి సంబంధించి భూసేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీలో భాగంగా భూసేకరణపై సంబంధిత నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ పథకంలో భాగంగా భూసేకరణకు సంబంధించి సర్వేను వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సర్వే నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ వివరాలను ఆయా మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా మండల స్థాయిలో రైతులను కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, డిప్యూటీ ఈఈ నరేష్ కుమార్, ఏఈఈలు, మీరాజుద్దీన్, గంగాధర్, తహసీల్దార్లు ప్రవీణ్, శ్రీదేవి, రాజు, మల్లేష్, అజీజ్ ఖాన్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యాంగం రక్షణ కవచం

నిర్మల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యాంగం రక్షణ కవచం లాంటిదని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ప్రజల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. రాజ్యాంగ నిర్మాతల కృషిని కొనియాడారు. మేధావుల కృషి ఫలితంగా మనకు పటిష్టమైన రాజ్యాంగం లభించిందన్నారు. రాజ్యాంగ విలువలు కాపాడుతూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

- సెంటర్ నిర్వాహకులకు జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ ఆదేశం
- ఖానాపూర్ సహా పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఖానాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని సెంటర్ నిర్వాహకులను జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఖానాపూర్‌తో పాటు సత్తనపెల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. స్వయంగా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నిబంధనలకు సరిపడా తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ శివరాజ్, తదితరులున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

మహిళల ఆర్థిక తోడ్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

దస్తురాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకకృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని మున్యాల్ గ్రామంలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేకచొరవ తీసుకుంటుందన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అనంతరం మండల కేంద్రంలో వీవోఏ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతకుముందు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డా. బీఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి, ఎంపీడీవో కే. రమేష్, ఏపీఎం గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షుడు గుండా నరేష్, నాయకులు రమేష్ రావు, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, రాజేశం, స్వామి, రంజిత్, చుంచు వెంకన్న, సురేందర్, కిరణ్, ఐకేపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

సంక్షిప్త సమాచారం

గజగజ..వణుకుతున్న జిల్లా ప్రజలు

నిర్మల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం 14 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనం చలి తీవ్రతతో గజగజ వణికిపోయారు. చలి తీవ్రతకు ఉదయం 9 గంటల వరకు ఇళ్ల నుంచి జనం బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. సాయంత్రం 4 గంటల నుండే వాతావరణం చల్లగా మారుతుండడంతో ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందేందుకు వెచ్చని స్వెటర్లు లాంటి విధరిస్తున్నారు. చలిధాటికి వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవితఖైదు

నిర్మల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర సిరంజి గ్రామానికి చెందిన నేరస్తుడు శీలేవార్ బాలాజీ భార్యను హత్య చేసిన ఘటనలో మంగళవారం జిల్లా న్యాయమూర్తి ఏ.కర్ణకుమార్ జీవితకాల కఠిన కారాగారశిక్షతో పాటు 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. భార్యాభర్తల మధ్య అపోహల కారణంగా గొడవపడుతుండేవారు. నిందితుడికి కుభీర్ మండలం బెల్గామ్ గ్రామానికి చెందిన నవనీతతో 2011లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, వివాహేతర సంబంధం ఉందన్న అను మానంతో భర్త శారీరకంగా, మానసికంగా హింసించడంతో తల్లిగారింటికి చేరింది. 10 అక్టోబరు 2020న భర్త వెళ్లి గొడవ చేయగా భార్య ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆమెను భైంసా ఆసుపత్రిలో సమీప వ్యక్తి చేర్పించగా మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ పంపించారు. 12న చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదుతో కుభీర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు 20 మంది సాక్షులను విచారించగా నేరం రుజువైంది. ఎస్పీ జానకీషర్మిల ఈ సందర్భంగా మా ట్లాడుతూ... నేరస్తులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. లైజన్ అధికారి ఎస్సై డల్లు సింగ్, కోర్టు డ్యూటీ అధికారి శ్రీనివాస్, ఇన్వెస్టిగేషన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

మేడిపల్లిలో ఉపాధి హామీ పథకం ప్రారంభం

నిర్మల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామంలో మంగళవారం పనికి ఆహార పథకం ఉపాధి హామీ పనులు మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ పథకం వినియోగించుకోవాలని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంట వేణుగోపాల్, నాయకులు కుంట పద్మాకర్, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన న్యాయవాదికి ఖానాపూర్ అడ్వకేట్‌ల పరామర్శ

ఖానాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఖాసీం ఇటీవల జరిగిన దుండగుల దాడిలో తీవ్ర గాయాలపాలైన నేపథ్యంలో మంగళవారం ఖానాపూర్‌కు చెందిన పలువురు న్యాయవాదులు ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లోని తన నివాసానికి వెళ్లి న్యాయవాదులు ఆయనను పరామర్శించినట్లు ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలియజేశారు. జరిగిన దాడి తాలూకు వివరాలను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్‌గౌడ్, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ సుబేదార్, ఖానాపూర్ న్యాయవాదులున్నారు.